









ఉరిమే ఉత్సాహం..

పరీక్షలు అయిపోయాయన్న ఆనందం ఓ వైపు.. రెండేళ్లు కలిసి చదువుకున్న స్నేహితులు మళ్లీ కలుస్తారో..? లేదో..? అన్న ఆవేదన మరోవైపు.. గురువారం ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద కనిపించిన దృశ్యాలివి. ఇంటర్ పరీక్షలు ముగియడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద విద్యార్థినులు ఇలా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కరచాలనం చేస్తూ.. బై బై చెప్పుకుంటూ వారి వారి ఇళ్లకు వెళ్లారు.

-సిద్ది పేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





విరగబూసిన మోదుగుపూలు

అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో మోదుగుపూలు విరగబూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వేసవి సీజన్‌లో అన్నిచెట్లు ఆకులు రాల్చి చిగురులతో ఆకట్టుకోగా మోదుగుచెట్లు మాత్రం ఎర్రరంగు పూలతో ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. హోలీ పండుగ సమీపిస్తుండడంతో మోదుగుచెట్లు కొత్త కళను సంతరించుకున్నాయి.

- అక్కన్న పేట, మార్చి 14

పరిష్కారమయ్యేనా?

- 'ధరణి'లో అడ్డగోలుగా తప్పులు
- సవరణకు 9,755 వినతులు
- 3 వేల దరఖాస్తులకు పైగానే తిరస్కరణ
- ఎట్టకేలకు మిగతా విన్నపాలకు మోక్షం!
- దశల వారీగా పరిష్కరించేందుకు కసరత్తు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 14 : పాస్‌బుక్‌లో పేరు తప్పుగా నమోదైందని ఒకరు.. విస్తీర్ణం నమోదులో పొరపాట్లు దొర్లాయని ఇంకొకరు.. వారసత్వంగా పౌతీ విరాసత్ చేయడం లేదని మరొకరు.. భూమి రిజిస్ట్రేషన్ అయినప్పటికీ మ్యూటేషన్ జరగడం లేదని వేరొకరు'.. ఇలా ధరణి పోర్టల్ కారణంగా ఇబ్బందులు పడుతున్నవారి సమస్యలన్నీ ఒక్కచోట చేరాయి. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల్లోని ధరణి పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తుల స్వీకరణ వెల్లువ కొనసాగింది. ఈనెల 9 వరకు అందిన దరఖాస్తుల ప్రామాణికత ఆధారంగా ప్రస్తుతం వాటి పరిష్కారం దిశగా కసరత్తు ప్రారంభించారు.


సిద్దిపేట జిల్లాలోని 26 మండలాలకు సంబంధించి నిత్యం తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు, ఇతర కార్యకలాపాలు జరుగుతున్నాయి. కాగా ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న పలు లోటుపాట్ల ద్వారా చాలామంది ఇబ్బందులకు గురయ్యారు. వీటిని సవరించడానికి అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అడుగులు పడ్డాయి.

పెండింగ్‌లో దరఖాస్తులు

ధరణిలో జిల్లాకు సంబంధించినంత వరకు 9,755 భూ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఈ వినతులన్నీ ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. రోజువారీ లావాదేవీలపై దృష్టి పెట్టడంతో సమస్యాత్మకమైన దరఖాస్తుల విషయంలో వేచిచూసే ధోరణిని అవలంబించారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఇలా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య వందల్లో ఉండడం గమనార్హం. అత్యధికంగా టీఎం 33 మాడ్యుల్‌కు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వే నంబర్లు తప్పుగా నమోదు కావడం, భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉండడం, పట్టాదారు లేదా తండ్రిపేరులో పొరపాట్లు దొర్లడం తదితర సమస్యలను పరిష్కరించే అవకాశం కేవలం సీసీఎల్‌ఏకు మాత్రమే ఉండడంతో ఇవన్నీ పరిష్కారానికి నోచుకోలేదు. ఇక పట్టాదారు చనిపోతే అతని పేరిట ఉన్న భూమిని వారసులకు చేయడానికి సమర్పించిన దరఖాస్తులు కూడా పెద్ద సంఖ్యలో పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిపై పలు అభ్యంతరాలు ఉండడం ఒక కారణమైతే, తగిన ఆధారాలు సమర్పించకపోవడం కూడా మరో కారణం. నిషేధిత భూములకు సంబంధించిన సర్వేనంబర్లలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్లూ పరిష్కారానికి నోచలేదు. ఇలాంటి వినతులు దాదాపు వెయ్యి దాకా ఉన్నట్లు అంచనా.

ఒక్కొక్కటిగా పరిశీలన..

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఒక్కొక్కటిగా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం సూచించినట్లుగా పరిష్కారానికి నోచుకునే దరఖాస్తులను ఒకవైపు.. అసమగ్రంగా ఉన్న దరఖాస్తులను మరోవైపు నమోదు చేస్తున్నారు. 9,755 ధరణి దరఖాస్తుల్లో ఇప్పటివరకు 7,660 దరఖాస్తులను పరిశీలించారు. ఇంకా 2,095 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. కాగా ప్రాథమిక పరిశీలనలో 3వేలకు పైగా దరఖాస్తులను తిరస్కరించినట్లుగా తెలుస్తోంది. మిగితా వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేలా నివేదికలు తయారు చేయడానికి కసరత్తు మొదలైంది.





తహసీల్దార్ టు సీసీఎల్ఏ..

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తహసీల్దార్ నుండి రాష్ట్రస్థాయిలో ఉన్న సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) దాకా పరిష్కరించాల్సిన అవసరం ఏర్పడుతున్నది. 14 రకాల భూసమస్యలకు సంబంధించి జిల్లాలో పెండింగ్ దరఖాస్తులున్నట్లుగా గుర్తించారు. సమస్యల ఆధారంగా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్‌ఏలకు సిఫారసు చేయనున్నారు. తహసీల్దార్ పరిధిలో పౌతీ విరాసత్, జీపీఏ, భూముల హద్దులు, పంచనామాలకు సంబంధించిన విషయాలను పరిష్కరించనున్నారు. ఇక ఆర్డీవో ద్వారా నాలా కన్వర్షన్, సేకరించిన భూ సమస్యలు, ఎన్‌ఆర్‌ఐ పోర్టల్, కంపెనీల పేరిట ఉన్న పట్టాలు, కోర్టుల్లో ఉన్న భూసమస్యలు పరిష్కారమవుతాయి. కలెక్టర్ పరిధిలో మ్యూటేషన్లు, అసైన్డ్ పట్టాల పౌతీ విరాసత్, నిషేధిత భూముల సమస్యలు, సెమీ అర్బన్, కోర్టు కేసులు, పాస్ బుక్ డేటా సవరణ తదితర అంశాలన్నింటిపై దృష్టి పెట్టనున్నారు. ఇక భూపరిపాలన కమిషనర్(సీసీఎల్‌ఏ) ఆధ్వర్యంలో ప్రధానంగా పాస్‌బుక్‌లో పొరపాట్లు, విస్తీర్ణంలో

షాన్-ఎ రమజాన్

ఇఫ్తార్ : 6:31 (శుక్రవారం సాయంత్రం)
సహర్ : 5:02 (శనివారం ఉదయం)

మావోయిస్టుల పేరుతో వాల్‌రైటింగ్, బ్యానర్లు కట్టిన

ఇద్దరి అరెస్ట్


7 లో..

- సామగ్రి స్వాధీనం, రిమాండ్‌కు తరలింపు

27 రోజుల్లో రూ.1.04 కోట్ల ఆదాయం

- మల్లన్న ఆలయంలో హుండీల లెక్కింపు

కొమురవెల్లి, మార్చి 14: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో సత్యసాయి మహిళా సేవా సమితి సభ్యులు హుండీల్లోని కానుకలను లెక్కించారు. 27 రోజులకుగాను రూ.1,04,86,906 నగదు, 97 గ్రాముల బంగారు మిశ్రమం, 12.500 కిలోల వెండి మిశ్రమం, 27 విదేశీ కరెన్సీ నోట్లు, 26 క్వింటాళ్ల బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిద్దిపేట వేంకటేశ్వర ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశ్వనాథశర్మ లెక్కింపును పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈవోలు గంగాశ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ధర్మకర్తలు, అధికారులు సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.




కొనసాగుతున్న మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు వెళ్లే కాలువ పనులు

కాలువ పనులపై నీలినీడలు!

- పూర్తికాని భూసేకరణ
- మధ్యలోనే ఆగిన తపాస్‌పల్లి రిజర్వాయర్ కాలువ నిర్మాణం

కొండపాక, మార్చి 14 : మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి తపస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించే కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. సుమారు 200 కిలోమీటర్ల దూరం నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ ద్వారా తరలిస్తున్నారు. దీంతో వ్యయం ఎక్కువ అవుతుంది. అయితే కాళేశ్వరం నీరు కుకునూరుపల్లి మండలం తిప్పారం వరకు వస్తున్నాయి. కేవలం 20 కిలోమీటర్ల మేర కాలువ పనులు చేపడితే తపస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని అందించవచ్చని గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు రూ.388 కోట్లు కేటాయించి గతేడాది పనులు ప్రారంభించారు. తిప్పారం నుంచి మంగోల్ మెదినీపూర్, లకుడారం మీదుగా కొమరవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు కుకునూరుపల్లి మండలం మంగోల్, మెదినీపూర్, కోనాయిపల్లి, లకుడారం గ్రామాలతో పాటు తపాస్‌పల్లిలో భూసేకరణ చేపట్టారు. ఇందులో దాదాపు 100 మంది రైతులు సుమారు 180 ఎకరాల వరకు కోల్పోతున్నారు. ఇందుకోసం రూ.30 కోట్లు అవసరమవుతున్నాయి. కొన్ని కారణాల వల్ల భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు లకుడారం శివారు వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా తిప్పారం నుంచి తపాస్‌పల్లి వరకు కాలువ ద్వారా నీటిని తరలించవచ్చు. కెనాల్ పూర్తయితే కొండపాక కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, దూళ్మిట్ట, బచ్చన్నపేట, నర్మెట తదితర మండలాల గ్రామాల్లోని 1,29,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



మెదినీపూర్ శివారులోని టన్నెల్ పనులు

బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టాం

- వెంకటేశ్వరరావు ఈఈ ఇరిగేషన్

కాలువ నిర్మాణంలో భాగంగా భూసేకరణ కోసం రూ.30 కోట్ల రూపాయలు అవసరమని బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టాం. అందుకు ఆమోదం కూడా లభించింది. నిధులు రాగానే త్వరలోనే భూసేకరణ చేసి పనులు చేపడతాం.

పూడుకుపోయిన జ్ఞాపకం

- కనిపించని చారిత్రక బావులు
- అభివృద్ధి పేరిట కొన్ని పూడ్చివేత
- ఆనవాళ్లు కోల్పోయినవి మరికొన్ని
- పరిరక్షణకు కానరాని చర్యలు

దుబ్బాక, మార్చి14 : గాజుల బావి.. దేవుని బావి.. రాట్నం బావి.. దొరవారి బావి.. గిరుకల బావి.. మంచినీళ్ల బావి.. చింతల బావి.. పుల్లకొండబావి.. దుబ్బాక వాసులకు ఈ బావులతో ప్రత్యేక అనుబంధం. ఇక ప్రతి బావికీ అబ్బురపరిచే నిర్మాణ శైలి ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో గడుల బావులను నిర్మించారు. ప్రస్తుతం బరువులను ఎత్తే పరికరాలు కూడా మోయలేని రాళ్ల కట్టడంతో నిర్మితమైన బావులు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. వీధులకు, చౌరస్తాలకు పేర్లున్నట్టుగానే చిరునామాలుగా నిలిచిన బావులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. దుబ్బాకలో అందరికీ ఈత నేర్పిన దేవుని బావి కానరాకుండా పోయింది. దుబ్బాకలోని గంగమ్మ గుడి వద్ద, పెద్దచెరువు సమీపంలో దేవుని బావి ఉండేది. మాజీ సీఎం కేసీఆర్ విద్యాభ్యాసం చేసిన సమయంలో ఆ బావుల్లో ఈత కొట్టానని ఎన్నోసార్లు చెప్పారు. వేసవి సెలవులు వచ్చాయంటే, ఆ బావిలోనే విద్యార్థులు ఈత నేర్చుకునే వారు. ఆ బావిని రహదారి వెడల్పు పేరుతో పూడ్చేశారు. చాలా బావులు కనుమరుగు అయినా, వాటి పరిరక్షణకు, పునురుద్ధణకు చర్యలు చేపట్టడం లేదు.

జాడలేని గిరికల బావి

దుబ్బాక మొత్తానికి నీరందించే మంచినీళ్ల బావి దుంపలపల్లి రహదారి సమీపంలో ఉండేది. దీన్ని గిరుకల బావి అని పిలిచేవారు. ఒకప్పుడు మహిళలందరూ ఆ బావి నుంచే నీటిని తోడుకుని వచ్చేవారు. ఇంటింటికీ నల్లాలు బిగించిన సమయంలో ఆ బావి నుంచే నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం ఆ బావి ఆనవాళ్లు కూడా లేకుండాపోయింది.



శిథిలావస్థకు చేరిన చెల్లాపూర్ వేణుగోపాల స్వామి ఆలయ కోనేరు బావి

కానరాని కానాల బావి

మోట కొట్టేందుకు రాళ్లను పేర్చి, కానాలుగా తీర్చిదిద్దారు. రంధ్రాలుగా పేర్చిన వాటి నుంచి నీళ్లను తోడేవారు. దీనిని కానాల బావి అనేవారు. ఈ బావి ద్వారా సుమారు 20 ఎకరాలకు సాగునీరందేది. ప్రస్తుతం కానాల బావి ఆనవాళ్లు లేకుండా పోయింది.

కూలిపోయిన గాజుల బావి

సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో డంగుసున్నంతో చుట్టూ గుండ్రంగా బావి రక్షణగా నిర్మించారు. ఆ బావి సుమారు 15 ఎకరాల సాగుకు ఉపయోగపడేది. గ్రామం మొత్తానికి అవసరాలకు ఉపయోగపడేది. ప్రస్తుతం ఆ బావి జాడలు కూడా లేకుండా పోయింది.

ధర్మాజీపేట దేవతల బావి కనుమరుగు

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో దేవతల బావి ఉండేది. అక్కడ దేవతలు వచ్చి స్నానం చేసేవారని స్థానిక ప్రజలు చెబుతుంటారు. ప్రస్తుతం ఆబావి పూర్తిగా ధ్వంసమైంది.

శిథిలావస్థలో కోనేర్లు

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చారిత్రక ఆనవాళ్లుగా చెల్లాపూర్ సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయం, ధర్మాజీపేట శివాలయం కోనేరులు ఉన్నాయి. సుమారు ఆరు శతాబ్దాల క్రితం నిర్మించిన కోనేర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన వీటిని ప్రభుత్వం కాపాడాలని, రక్షణ చర్యలు చేపట్టి రేపటి తరానికి అందించాలని ప్రజలు కోరుతున్నారు. మల్లన్నసాగర్ బృహత్‌కార్యంతో దుబ్బాక మండలంలో ఇటీవల చెరువులు నిండుకుని, వాగులు పొంగుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఇటీవల కూడవెల్లి వాగులో పడి మరణించిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. రేపటి తరానికి ఈత ముఖ్యమనేది ప్రమాదాలను చూస్తే అర్థమవుతుంది. శారీరక, మానసికోల్లాసానికి ఈత అవసరం అనే స్థాయి నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి ఈత అవసరమనే స్థాయికి పరిస్థితులు చేరాయి. దుబ్బాకలో ఈతకు ప్రధానంగా కోనేరులే ఉపయోగపడేవి. ప్రస్తుతం అవి కూడా శిథిలావస్థకు చేరడంతో వాటికి మరమ్మతులు చేయించాలని, అలాగే ఈతకొలనులను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



చెల్లాపూర్ సోమేశ్వరాలయం కోనేరు

తిరుమలలో తప్పిపోయిన సిద్దిపేట యువతి

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం కోసం తల్లితో తిరుమలకు వచ్చిన ఓ యువతి తప్పిపోయింది. తల్లి వివరాల మేరకు.. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా, బెజ్జంకికి చెందిన డొక్క సారమ్మ మానసిక దివ్యాంగురాలైన కుమార్తె డొక్క రాజేశ్వరి(24)తో కలిసి గతేడాది నవంబరు 13న తిరుమలకు వచ్చింది. దర్శనం అనంతరం రాజేశ్వరితో కలిసి ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్నారు. అక్కడున్న మెట్లపై కూర్చోబెట్టి టీ తీసుకొచ్చేందుకు సారమ్మ వెళ్లింది. తిరిగొచ్చి చూసేసరికి రాజేశ్వరి కనిపించలేదు. దీంతో సారమ్మ పరిసర ప్రాంతాలతో పాటు తిరుమల మొత్తం గాలించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సొంతూరుకు చేరుకుని వెతికింది. ఆ తర్వాత వారి కుటుంబసభ్యులు తిరుమలకు చేరుకుని డిసెంబరు 29న తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె రాజేశ్వరి వివరాలు తెలిసిన వారు 81063 56409 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని ఆమె కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 14: విద్యుదాఘాతంతో యువకుడు గురువారం మృతిచెందాడు. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన వడ్డా శ్రీను అడవి పందుల బెడద నుంచి జొన్న పంటను కాపాడుకునేందుకు విద్యుత్ కంచెను ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఏర్పాటు చేశాడు. అయితే ఇదే గ్రామానికి చెందిన అంతర్గామ జైపాల్(30) వడ్డా శ్రీను జొన్న చేను పక్కన తన పశువులకు మేత కోస్తున్నాడు. పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగను జైపాల్ గమనించకపోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మేత కోసం వెళ్లిన జైపాల్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య సావిత్రి, కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. తన భర్త మృతికి కారణమైన శ్రీనుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

సంగారెడ్డి రూరల్, మార్చి 14: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 30 వరకు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డి.వసంత కుమారి గురువారం తెలిపారు. దీనికిగాను 2 నుంచి 3 పశువైద్య సిబ్బంది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మూడునెలల వయస్సు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, పాడి రైతులకు సమాచారం అందించేలా చూడాలన్నారు. ఉదయాన్నే సిబ్బంది వెళ్లి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని, ఈ వ్యాధిన బారిన పడితే పశువులకు నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయడం, నడవడంలో ఇబ్బందులు పడతాయని వివరించారు.

కార్మికుల భద్రత గాలికి..

- పరిశ్రమలలో తరచూ ప్రమాదాలు
- కార్మిక చట్టాలు పట్టించుకోని యాజమాన్యాలు
- గాలిలో కలుస్తున్న కార్మికుల ప్రాణాలు
- అధికారుల పర్యవేక్షణ శూన్యం

- 2021 అక్టోబరు 11న కోవాలెంట్ పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-3లో రియాక్టర్ క్లీన్ చేస్తుండగా ప్రమాదం సంభవించి అల్లా దుర్గం మండలం బైరన్‌దిబ్బ గ్రామానికి చెందిన వీరన్న తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

- 2016 డిసెంబరు 28 ఇదే పరిశ్రమలో రియాక్టర్ పేలి అక్కడ విధులు నిర్వహిస్తున్న సంగారెడ్డి సమీపంలోని రాజంపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

- ఈనెల 5న పీబీ-4లో జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు తీవ్రగాయాలకు గురయ్యారు. అందులో హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌కుమార్, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లై బాబు తుర్రై, ఫాదర్ మారండిలు మృతిచెందారు.

పైన సంఘటనలే కాకుండా... సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఆయా పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలకు కార్మికులు బలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హత్నూర, మార్చి 14: హత్నూర మండలంలోని గుండ్లమాచునూర్, బోర్పట్ల, తుర్కలఖానాపూర్, చందాపూర్ గ్రామపంచాయతీల పరిధిలో పలు రసాయన, స్టీల్ పరిశ్రమలు ఉన్నాయి. తమ ప్రాంతంలో సరైన ఉపాధి లేక బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి వందలాదిమంది కార్మికులు మండలంలోని పరిశ్రమల్లో పనిచేసేందుకు వస్తున్నారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రశ్నించేవారు లేక యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు ఆడిందే ఆట అన్న చందంగా పరిస్థితి తయారైంది. తరచూ తనిఖీలు చేసి కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడా కనిపించడం లేదు.

అనుభవం లేని కార్మికులతో పనులు

ఉన్నత చదువులు చదివి అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనం ఇవ్వాల్సి వస్తుందన్న దురుద్దేశంతో అనుభవం లేని కార్మికులను విధుల్లో చేర్చుకుంటున్నారు. యంత్రాల వద్ద ఈ కార్మికులతో పరిమితికి మించి పనులు చేయించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులకు రక్షణ పరికరాలను ఇవ్వకపోవడం, యంత్రాల పనితీరుపై అవగాహన లేకపోవడం, ప్రమాదాలు సంభవిస్తే తప్పించుకునే జాగ్రత్తలు తెలియక చిన్న చిన్న ప్రమాదాలకే ప్రాణాలు కోల్పోతున్నారు.



హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలెంట్ పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు(ఫైల్)

బయటకు పొక్కకుండా..

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినా కంపెనీల యాజమాన్యాలు బయటకు పొక్కనీయడం లేదు. బాధిత కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసి ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ప్రతి పరిశ్రమల్లో భద్రత అధికారి (సేఫ్టీ ఆఫీసర్) నిత్యం కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నది. అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ఎలా వ్యవహరించాలనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించాలి. కానీ ఆయా పరిశ్రమలల్లో అలాంటివేవీ జరగడం లేదు.

మృతుల్లో పొరుగు రాష్ట్రాల వారే అధికం

హత్నూర మండలంలోని పరిశ్రమల్లో ఒడిస్సా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులే అధికంగా పనిచేస్తున్నారు. వారికి కార్మిక చట్టాలు.. రక్షణ పరికరాల గురించి అంతగా తెలియదు. ఇదే అదునుగా భావించిన పరిశ్రమల యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు వారిచేత నిర్ణీత పని గంటల కంటే ఎక్కువ పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో ఇతర రాష్ట్రాల కార్మికులే అధికంగా చనిపోతున్నారు. చికిత్స పేరుతో గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలకు తరలించి ఎంతో కొంత పరిహారం చెల్లించి మృతదేహాలను వారి సొంత గ్రామాలకు పంపుతున్నారు. మృతుల కుటుంబీకులను కనీసం పరిశ్రమ వద్దకు కూడా రానివ్వడం లేదంటే పరిశ్రమల యాజమాన్యాల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

మండలంలోని పరిశ్రమలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ... ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అంతగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ తనిఖీ పేరుతో అధికారులు వచ్చినా.. పరిశ్రమల యాజమాన్యాలు రాచ మర్యాదలు చేసి ఎంతో కొంత ముట్టజెప్పుతుండడంతో నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



కోవాలెంట్ పరిశ్రమలో ముగ్గురు కార్మికుల మృతికి కారణమైన రియాక్టర్(ఫైల్)

యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం

పరిశ్రమలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భద్రతా ప్రమాణాలపై పరిశ్రమల యాజమాన్యాలకు సలహాలు, సూచనలు చేస్తున్నాం. గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలెంట్ లాబోరేటరీస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ప్రాథమిక విచారణ చేసి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నాం. పూర్తి విచారణ అనంతరం ఆ పరిశ్రమపై చర్యలు తీసుకుంటాం.

- ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కౌడిపల్లి, మార్చి 14: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందాడు. కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన దశరథ(38) మూడేళ్ల నుంచి ప్రకృతి వనంలో మొక్కలు పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం నర్సరీలో మొక్కలకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడే కిందపడిపోయి ఉన్నాడన్న సమాచారం కుటుంబీకులు తెలుసకుని 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఒకరికి రిమాండ్

సిద్దిపేట రూరల్, మార్చి 14: కూలి డబ్బుల కోసం హత్యకు పాల్పడిన వ్యక్తిని సిద్దిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను హత్యకు గల వివరాలను వెల్లడించారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్న ఉండవెల్లి గ్రామ శివారులోని ఎల్లంకి కళాశాల సమీపంలో ఓ ఇంటి నిర్మాణ పనికి తిరుపతి, రమేష్, రాజయ్య ఈనెల 10న కూలీకి వెళ్లారు. ముగ్గురికి కలిపి ఇంటి యజమాని రూ.2 వేలు తిరుపతికి ఇచ్చాడు. రమేష్‌కు, రాజయ్యకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చి మిగతా డబ్బులు తిరుపతి వద్దనే ఉంచుకున్నాడు. మరుసటి రోజు వారికి పని దొరక్కపోవడంతో తిరుపతి, రమేష్ కలిసి వారు కూలీకి వెళ్లిన చోట మద్యం సేవించారు. ఈ క్రమంలో ఏర్పడిన ఘర్షణలో ఇరువురు కట్టెలతో కొట్టుకున్నారు. అయితే రమేష్ తిరుపతిని గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన రమేష్ తిరుపతి మృతదేహాన్ని పక్కన ఉన్న కాలువలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు అతడిని గురువారం రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

సిద్దిపేటరూరల్, మార్చి 14: గంజాయి విక్రయిస్తున్న యువకులను సిద్దిపేట పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు, సిద్దిపేట పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మరో నలుగురు యువకులతో కలిసి గంజాయి ప్యాకెట్లను లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 417 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు గురువారం ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టుల పేరుతో వాల్‌రైటింగ్, బ్యానర్లు నిందితులు ఇద్దరు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

తొగుట, మార్చి 14: మావోయిస్టుల పేరుతో వాల్‌రైటింగ్, బ్యానర్లు కట్టిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం తొగుట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ లతీఫ్ వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన బోనాల రాజు అలియాస్ గగన్(34) వృత్తి రీత్యా డ్రైవర్. అతడికి గ్రామ శివారులో 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా... అందులో 4 ఎకరాల 23 గుంటల భూమిని 2014లో హెటిరో ఫార్మా కంపెనీకి విక్రయించాడు. మిగతా ఎకరా 17 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆ భూమికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఫార్మా కంపెనీ యాజమాన్యం ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడం ప్రారంభించింది. దాంతో రాజు కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు మాట్లాడినా స్పందించలేదు. తన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశంతో పథకం రచించాడు. మహారాష్ట్రకు చెందిన రాజు స్నేహితుడు యాష్ అజయ్(24)ని తీసుకుని ఈ నెల 9న రాత్రి 12 గంటలకు హైదరాబాద్ నుంచి హోండా యాక్టివాపై పెద్దమాసాన్‌పల్లికి చేరుకున్నాడు. గ్రామ శివారులోని పన్యాల ఎల్లారెడ్డి వ్యవసాయ పొలం వద్ద స్టాటర్ డబ్బాకు మావోయిస్టుల హెచ్చరిక పేరుతో రాసిన ఎర్రని వస్త్రంతో కూడిన బ్యానర్ కట్టారు. అక్కడి నుంచి ఫార్మా కంపెనీ సెక్యూరిటీ రూంల గోడలపై వెంట తెచ్చుకున్న కలర్ డబ్బాలతో మావోయిస్టుల పేరుతో హెచ్చరిక రాతలు రాసి వెళ్లిపోయారు. కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం సాయంత్రం తొగుట ఎస్‌ఐ లింగం ఆధ్వర్యంలో పోలీసులు తొగుటలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రాజు, అతడి స్నేహితుడు యాక్టివాపై అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని పట్టుకుని విచారించగా పెద్దమాసాన్‌పల్లి ఫార్మా కంపెనీ భూముల గోడలపై మావోయిస్టుల పేరుతో బ్యానర్, వాల్‌రైటింగ్ రాసినట్లు ఒప్పుకున్నారని సీఐ వివరించారు. వారి నుంచి రంగు డబ్బాలు, బ్రష్, సెల్‌ఫోన్, హోండా యాక్టివా వాహనంతో పాటు ఆరోజు వారు వేసుకున్న దుస్తులను సీజ్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తొగుట ఎస్‌ఐ లింగం, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాచన్నస్వామి జాతర ప్రారంభం



ఆలయం ముందు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోహీర్, మార్చి 14: మండల పరిధిలోని బిడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడురోజులపాటు జరిగే ఈ జాతరలో భాగంగా మొదటిరోజైన గురువారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగ పూజ, గోపూజ, స్వస్తి పుణ్యావాచనం, అంకురార్పణ, నాంది సమారాధన అఖండ దీపా ప్రజ్వలన కార్యక్రమాలతో పాటు శివయోగి శివాచార్య మహాస్వామి తంగడపల్లిచే ధ్వజారోహణం, శిఖర పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు అమృత ప్రవచనాలు, 10 నుంచి 12 గంటల వరకు హరికథ, భజనలు, బుర్రకథ నిర్వహించారు. రాత్రి 11 గంటలకు పట్లోళ్ల శివశరణప్ప గృహం నుంచి శ్రీమఠం రాచయ్యస్వామి గురువు గృహం వరకు ఊరేగింపుగా బయల్దేరి అక్కడి నుంచి దేవస్థానం వరకు వచ్చి అగ్ని ప్రతిష్ఠ (అగ్ని దహనం) చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దయానంద్ పాటిల్, సభ్యులు స్వరూప, శ్రీపాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతం నుంచి మహోన్నతంగా ఎదగాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ అగ్రవాల్



విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు

సిద్దిపేట రూరల్, మార్చి 14: విద్యార్థులు వారి మేధాశక్తిని ఉపయోగించి మారుమూల ప్రాంతం నుంచి మహోన్నతంగా ఎదగాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ అగ్రవాల్ సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్ గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గొప్ప లక్ష్యంతో చదవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాలకు ప్రతిఫలమే విద్యార్థులు పరీక్షల్లో సాధించే ఉత్తమమైన ఫలితాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికితీసేందుకు జన విజ్ఞానవేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించడం, ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా సైక్లింగ్ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీధర్ ద్వితీయస్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన సూర్యతేజ, ఉదయ్, అశ్విన్‌లను, ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలో ద్వితీయస్థానం సాధించిన శ్రీధర్ తల్లిదండ్రులను శాలువా కప్పి సన్మానించారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానం సాధించినందుకుగాను మోడల్ స్కూల్‌కు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టెలీస్కోప్‌ని బహుకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుచ్చిబాబును, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే 'పది'లమే

- తడబాటు, ఒత్తిడికి దూరంగా ఉండాలి
- భయం వీడితో విజయం మీదే అంటున్న నిపుణులు

కొండపాక, మార్చి 14: విద్యార్థి దశకు పదో తరగతి తొలిమెట్టు... మరో మూడురోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పదిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం కోసం పలు సూచనలు జాగ్రత్తలు పాటిస్తే భయం లేకుండా అధిక మార్కులను సాధించవచ్చు. పది పరీక్షల్లో చిన్నపాటి తప్పిదాలతో మార్కులు కోల్పోతున్నారు. తొలిసారి రాసే పబ్లిక్ పరీక్షలు కావడంతో పిల్లల్లో ఒత్తిడి, తడబాటు ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే జయించవచ్చు. పరీక్షలు రాసేటప్పుడు చిన్న చిన్న తప్పులు చేయడంతో మార్కులను కోల్పోతున్నారు. ఈ విషయాలన్నింటిపై విషయ పరిజ్ఞాన నిపుణులు, సబ్జెక్టు టీచర్లు పలు సూచనలు అందిస్తున్నారు. వాటిని పాటిస్తే విద్యార్థులు అధిక మార్కులను సాధించవచ్చని చెబుతున్నారు. ఎంత కష్టపడి చదివినా పరీక్షల్లో ఏం రాయగలిగాం, ఎంత బాగా రాయగలిగామన్నదే ప్రధానం. ఏడాది పొడవునా ముందస్తు పరీక్షలు ఎన్ని నిర్వహించినా.. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎన్నో పొరపాట్లు చేస్తున్నారు. సాధారణ పరీక్షల్లో జరిగే తప్పుల వల్ల నష్టం ఏమీ లేకపోవచ్చు. కానీ చివరి పరీక్షల్లో అవే పొరపాట్లు పునరావృతమైతే జరిగే నష్టం అపారమని ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు. పగలు, రాత్రి చెమటోడ్చి చదవటమే కాదు.. అలా చదివింది, తప్పిదాలకు తావీయకుండా పరీక్షల్లో సమర్థంగా రాయగలిగినప్పుడే చక్కని ఫలితం వస్తుంది.



బెజ్జంకి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

సమాధాన పత్రాలతో కూడిన బుక్‌లెట్ ఇవ్వగానే ముందుగా ప్రతి పేజీకి ఎడమవైపు మార్జిన్ వదలాలి. పేపరు దిద్దేవారు మార్కులు వేయటానికి ఇది అవసరం. లేకపోతే ఒక్కోసారి జవాబుకు వేసిన మార్కులు కనిపించక లెక్కవేయడం మరిచిపోతుంటారు. దీన్ని చాలామంది విద్యార్థులు పాటించరు. ప్రశ్నాపత్రం ఇవ్వగానే క్షుణ్ణంగా చదువుకోవాలి. ప్రశ్నాపత్రం చదవడానికి 15 నిమిషాలు సమయం కేటాయించారు. కానీ అలా చేయకుండా రాయడానికి సిద్ధమవుతారు. ముందుగా ప్రశ్నలను బాగా చదివాకే సమాధానాలు రాయటం ఆరంభించాలి. ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయొచ్చు. ఆ ప్రశ్న నంబరును ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి.

ఇవి పాటించండి

- రాయాల్సినవన్నీ పూర్తయ్యాకే ఛాయిస్ ప్రశ్నలు రాయడానికి ప్రయత్నించాలి. లేకుంటే సమయం సరిపోక ఇబ్బందితలెత్తే అవకాశముంది.
- పేజీ చివర కొంత ప్రదేశం మిగిలిందని ఇంకో జవాబు రాయటం, పదాన్ని విడకొట్టి రాయటం చేస్తున్నారు. ఇలా చేయకూడదు.
- ఎర్ర సిరాపెన్ను వాడకూడదు. నీలం బ్లూ, నలుపు సిరా ఉండేవాటినే ఉపయోగించాలి.
- పెద్దపెద్ద అక్షరాలతో, మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపడం వల్ల ప్రయోజనం శూన్యం. దీనివల్ల దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు అసహనానికి లోనవుతారు. ప్రతి పుటకు 20-25 వాక్యాలు రాస్తే మేలు.
- జవాబులను వ్యాసంలా కాక బుల్లెట్ పాయింట్ల రూపంలో రాయాలి. దానివల్ల మూల్యాంకనం చేసేవారికి సులభంగా అర్థమవుతుంది.
- బిట్ పేపర్‌లో కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదు. బ్రాకెట్‌లో ఒకటి రాసి, మళ్లీ కొట్టివేసి బయట రాస్తున్నారు. ఇలా చేయటం సరికాదు.
- సాధ్యమైనంతవరకు 10-15 నిమిషాలు ముందే పరీక్ష రాయటం పూర్తిచేయాలి. రాసిన జవాబులు, ప్రశ్నల నంబర్లను మరోసారి పరిశీలించుకోవాలి.

సబ్జెక్టుల వారీగా జాగ్రత్తలు

- గ్రాఫులు, పటాలు, బొమ్మలను పెన్సిల్ తోనే గీయాలి. పెన్నులు, స్కెచ్ పెన్నులు వాడకూడదు.
- సాంఘిక శాస్త్రంలోని సమకాలీన అంశాలలో మూస ధోరణులకు ప్రాధాన్యం తగ్గించి, సొంత అవగాహనతో నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయడం మేలు.
- గణితం, భౌతిక, జీవ, సాంఘికశాస్త్రాల్లో సమాధానాలు రాసేటప్పుడు మొదట 2 మార్కులవి, తర్వాత ఒక మార్కువి రాయాలి. చివరగా 4 మార్కుల సమాధానాలు రాస్తే మంచిది.
- ఆంగ్లం, తెలుగు, హిందీలో వ్యాకరణ, అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడటం చాలా ముఖ్యం.
- భౌతికశాస్త్రంలోని సమస్యల (ప్రాబ్లమ్స్)లో ప్రమాణాలను రాయడం మరిచిపోరాదు. ఉదాహరణకు సెంటీ మీటరు, గ్రాము, జౌలు, వాట్స్ తదితరాలు.
- జీవశాస్త్రంలో ప్రయోగాలకు చెందిన జవాబులను రాసేటప్పుడు సంబంధిత బొమ్మలను కూడా తప్పక వేయాలి.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్


బెజ్జంకి, మార్చి 14: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థులకు ఆందోళన, భయం ఉండడం సహజం. కానీ ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతిలో అధిక మార్కులు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. ప్రతి విద్యార్థి పదో తరగతి తొలిమెట్టుగా భావించి ఏకాగ్రతతో చదువుకుంటే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని ఉపాధ్యాయులు, విద్యా నిపుణులు సూచిస్తున్నారు. బెజ్జంకి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 396 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కౌడిపల్లి, మార్చి 14: జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌడిపల్లి మండలం కేంద్రానికి చెందిన మాసన్నగారి నవీన్(34) కొంతకాలంగా తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. కాగా గురువారం ఉదయం చింతపండు కోసమని తన కుమారుడిని వెంట పెట్టుకుని గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి చెల్లి కవిత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుల నిరసన

- అనాథలకు ఆశ్రమం ఏర్పాటు చేయాలని డిమాండ్



సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

బెజ్జంకి, మార్చి 14: అనాథాశ్రమం ఏర్పాటు చేయాలని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి, జంగాపల్లి గ్రామాలకు చెందిన భామండ్ల రాజు, మహంకాళి ప్రశాంత్, కొంకటి వేణు అనే ముగ్గురు యువకులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బాలుర పాఠశాల వెనకాల ఉన్న సెల్‌టవర్ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల వెంట ఎంతోమంది అనాథలు ఉండేందుకు చోటు లేక నిరాశ్రయులుగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి కోసం తమవంతుగా కొద్దినెలలుగా ఆహారం పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క వచ్చేవరకు కిందికి దిగమని సుమారు రెండు గంటల పాటు టవర్‌పై కూర్చున్నారు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడారు. అయినా వినకపోవడంతో అధికారులకు సమాచారాన్ని అందించారు. ఎంపీడీవో లక్ష్మప్ప యువకులతో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో యువకులు సెల్ టవర్ దిగారు. తమకు కూడా అమ్మానాన్నలు లేరని, అనాథలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని గుర్తుచేశారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

వర్గల్, మార్చి 14: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు నాచగిరి లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ప్రకటించినటువంటి సిద్దిపేట జిల్లాలోని వర్గల్ మండలం నాచారం గుట్ట శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రం, కోమురవెల్లి మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు వివరించారు. ధర్మకర్తల మండలికి 20 రోజులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జగదేవ్‌పూర్ తహసీల్దార్‌గా కృష్ణమోహన్

జగదేవ్‌పూర్, మార్చి 14: జగదేవ్‌పూర్ నూతన తహసీల్దార్‌గా కృష్ణమోహన్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రావణ్‌కుమార్ బదిలీపై గజ్వేల్‌కు వెళ్లారు.

మల్లన్నసాగర్ కాలువలను పూర్తి చేయాలి

- కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం వహిస్తే సహించం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 14: దుబ్బాక నియోజకవర్గం సశ్యామలం చేయడానికే మల్లన్నసాగర్ నిర్మాణం చేశామని, ఈప్రాంతానికే మొదటి ఫలితం అందాలనే తపనతో తాను పని చేస్తున్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో పూర్తి కావల్సిన కాలువ పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గురువారం దుబ్బాక మండలం మల్లాయపల్లి, కమ్మర్‌పల్లి, పెద్దచీకోడు, పోతారం గ్రామాలకు వెళ్లే కాలువల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. మల్లాయపల్లి కాలువను వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. దుబ్బాక నియోజకవర్గంలో లక్ష 40 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో తమ నేత మాజీ సీఎం కేసీఆర్‌పని చేశారన్నారు. మల్లన్నసాగర్ నుంచి అందించాల్సిన నీటిని అధికారులు వెంటనే విడుదల చేయాలన్నారు. చెరువులలో నీటిమట్టం తగ్గి, భూగర్భజలాలు పూర్తిగా తగ్గాయన్నారు. ఈప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిందిపోయి, కేవలం తమ అధినేత కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ ఎస్‌సీ, బస్వరాజ్, ఈఈ వేణుబాబు, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఆసయాదగిరి, ఎంపీటీసీ ఎల్‌రాంరెడ్డి, తౌడశ్రీనివాస్, మల్లేశంగౌడ్, తదితరులున్నారు. దుబ్బాక పట్టణంలోని సీనియర్ నాయకుడు ఆస చిన్నముత్యం కుమారుడు సాగర్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకుని, గురువారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకరరెడ్డి ఆయనను పరామర్శించారు.


అధికారులతో సమీక్ష జరుపుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకరరెడ్డి


దుబ్బాకలో మల్లన్నసాగర్ కాలువల పనులను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకరరెడ్డి

అనభేరి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, మార్చి 14 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనభేరి, సింగిరెడ్డిల వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని బస్‌డిపో క్రాస్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు అనభేరి అని కొనియాడారు. తెలంగాణ భారత దేశంలో విలీనం కావడానికి కమ్యూనిస్టు పార్టీ పోరాటాల వల్లే జరిగిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటవీరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, అందె స్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, విప్లవకుమారి, నాయకులు ఎడల వనేష్, గూడెం లక్ష్మి, శంకర్, భాస్కర్, పద్మ, బెక్కంటి సంపత్, మాడిశెట్టి శ్రీధర్, గోపి, జేరిపోతుల జనార్ధన్ పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణ

అక్బర్‌పేట- భూంపల్లి, మార్చి14: మహిళ మెడలో నుంచి గొలుసు అపహరించిన సంఘటన మండలంలోని ఎనగుర్తి(కూడవెల్లివాగు) ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం చోటుచేసుకున్నది. ఎనగుర్తి గ్రామానికి చెందిన కొయ్యడ యాదమ్మ స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద కల్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నది. సాయంత్రం కల్లు అమ్ముకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన అపరిచిత వ్యక్తి ఆమె మెడలోనుంచి మూడుతులాల బంగారు గొలుసును లాక్కెల్లాడు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 14: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో లెక్కించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా టికెట్ బుకింగ్ ద్వారా రూ.314275, డిజిటల్ హుండీ ద్వారా రూ.33702, హుండీ లెక్కింపు ద్వారా రూ. 942645, జాతర సందర్భంగా మొత్తం రూ.12,90,622 ఆదాయం వచ్చినట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా దేవాదాయ ధర్మదాయశాఖ పరిశీలకులు రంగారావు, మహిళా సంఘం సభ్యులు, హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎంపీడీవో వేణుగోపాల్

నంగునూరు, మార్చి 14 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ అన్నారు. నంగునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ కర్లకంటి రేణుక అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు చాలామందికి అర్హుల జాబితాలో చోటుదక్కలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో భాగంగానే మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, గ్యాస్ పథకం గురించి ఏమన్నా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులను కోరారు. గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారలదేనని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకాధికారలకి చెక్ పవర్ కూడా ఇచ్చామన్నారు. ఐదు గ్యారంటీ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాలని సహకార సంఘం చైర్మన్ కోల రమేశ్ గౌడ్ అన్నారు. సమావేశంలో ఎంఈవో దేశీ రెడ్డి, ఏవో గీత, ఎంపీటీసీలు బెదురు తిరుపతి, కోల సునీత మహేందర్ గౌడ్, ఏటి తులసి పరమేశ్వర్, జ్యోత్స్న నరసింహరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్

ప్రతీ ఇంటికి నల్లా ద్వార నీరందిస్తాం

- ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ

నారాయణరావుపేట,మార్చి14: ప్రతీ ఇంటికి నల్లాద్వార నీరందించడం జరుగుతోందని, రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకముందే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అధికారులకు సూచించారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టు కాలువలతో త్వరగా సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. నారాయణరావుపేట మండలంలోని పది గ్రామాలు ఆదర్శంగా ఉన్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని చెప్పారు. ఎంపీటీసీ హరీశ్ మండలంలో చేపట్టాల్సిన 11 తీర్మానాలు ప్రవేశ పెట్టగా ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ బలపరిచారు. సభ్యులందరూ తీర్మానాలను స్వాగత్రించారు. ఓ వైపు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుంటే మిగతా అధికారులు ఎవరికి వారే సెల్ ఫోన్‌లలో బీజీగా ఉన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల మండల సమావేశంలో చర్చించి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత మరిచి సెల్ ఫోన్‌లో నిమగ్నవడం హాస్యాస్పదంగా మారింది. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో యాదవరెడ్డి, ఏఈలు పవన్ కుమార్, తిరుపతి, వేంకటేశ్, ఏవో వెంకట రమణి, ఏపీఎం ధర్మసాగర్, ఎంపీవో స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులు

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

హుస్నాబాద్ టౌన్, మార్చి 14 : అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు కోరారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో రైతురక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని, వర్షాభావంతో ఎండిన పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం అందించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ప్రభుత్వం ద్వారా బ్యాంకు అప్పులు ఇప్పించాలని, పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, అయిలేని మలికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, పచ్చిమట్ల రవీందర్, అయిలేని శంకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గాల్‌రెడ్డి ఉన్నారు.

'పంటలకు సాగు నీరు అందించాలి'

చిన్నకోడూరు, మార్చి 14 : పంటలకు సాగు నీరు అందించి అన్నదాతలను ఆదుకోవాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి కోరారు. గురువారం చిన్నకోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అనంతగిరి (అన్నపూర్ణ), రంగనాయకసాగర్ ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నీటితో నింపి, యాసంగిలో రైతులకు పంటలు కోతకు వచ్చేవరకు సాగు నీటిని అందించిదని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రంగనాయకసాగర్ ప్రాజెక్టులోకి ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసి పంటలకు సాగు నీరు అందిస్తుందన్నారు. దీనితో పంటలు పొట్ట దశకు వచ్చే సరికి నీరు అందక ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.

మండల బీజేవైఎం అధ్యక్షుడి నియామకం

రాయపోల్, మార్చి 14: రాయపోల్ మండల భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడిగా బాగన్నగారి సుఖేందర్‌రెడ్డిని అధిష్ఠానం నియమించింది. గురువారం ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని మండల పార్టీ అధ్యక్షుడు రాజాగౌడ్ సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, గజ్వేల్ రామచంద్రం, నీల చంద్రం, తిరుపతిరెడ్డి, తూర్పు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల జీవితాల్లో చీకటి నింపిన కాంగ్రెస్'

సిద్దిపేట క్రైం, మార్చి 14 : కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికుల జీవితాల్లో చీకటి నింపిందని సిద్దిపేట ఆటో క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం ఆరోపించారు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. బతుకు భారం కావడంతో ఎంతోమంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆటో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం వల్ల సుమారు 50 లక్షల ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులకు న్యాయం చేయకపోతే కార్మికులందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు

మిరుదొడ్డి,మార్చి 14: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారు తీరు మార్చుకోవాలని మిరుదొడ్డి ఎంపీపీ గజ్జల సాయిలు హెచ్చరించారు. గురువారం మిరుదొడ్డిలో సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో సాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అల్వాల గ్రామంలో పగటి వేళల్లో కూడా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి ఎంపీపీ ఆపాధ్యక్షుడు పోలీస్ రాజు తీసుకెళ్లినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. అలాగే గ్రామంలో సాగునీరు సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. లేనియేడల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, తహసీల్దార్ గోవర్ధన్ వ్యవసాయాధికారి మల్లేశం, ఎంఈవో ప్రభుదాస్ తదితరలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలు

ప్రభుత్వ పరిశోధన కేంద్ర విత్తనాలనే సాగు చేయాలి

- ప్రొఫెసర్. డాక్టర్ నగేశ్ కుమార్


బుస్సాపూర్ గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్, మార్చి 14: ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన కేంద్రాలు విడుదల చేసిన విత్తనాలనే సాగు చేయాలని హైదరాబాదులోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్. నగేశ్ కుమార్ సూచించారు. సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న చిరు సంచలైన డీహెచ్‌ఎం 182, 206, కేఎన్‌ఎంహెచ్ 4191 హైబ్రిడ్ రకాలను ప్రభుత్వ పరిశోధన కేంద్రం విడుదల చేసినట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తే నికర ఆదాయంతో పాటు పంట మార్పిడి జరుగుతుందన్నారు. మొక్కజొన్న సాగు చేసిన రైతు మన్నె సాయిలు మాట్లాడుతూ.. వర్ష కాలంలో 35 నుంచి45క్వింటాళ్లు, యాసంగిలో 40నుంచి45క్వింటాళ్లు ఎకరాకు దిగుబడి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. శ్రీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్. మల్లయ్య, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు డాక్టర్ .విజయ్, డాక్టర్. పల్లవి, డాక్టర్.ఉమారాణి డాక్టర్.సరిత, మండల వ్యవసాయ అధికారి పరుశురాంరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రేమ్ సాయి, రైతులు తిరుపతిరెడ్డి, కనకయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి

గజ్వేల్/బెజ్జంకి మార్చి 14: సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలసి గురువారం సీఎం రెవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వారితో నాయకులు సర్దార్‌ఖాన్, రాములుగౌడ్, మోహన్నగారి రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, సిద్ది భిక్షపతి, నేత నాగరాజు, మామిడి కృష్ణ, ప్రేమ్‌కుమార్, రాజు, అజ్జర్ తదితరులున్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు ముదిరాజ్ సంఘం సభ్యులు గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోచయ్య, కనకయ్య, సొసైటీ వైస్ చైర్మన్ రాజేష్, శ్రీకాంత్, రాజేందర్, లక్ష్మణ్, మల్లేశం, బాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కోసం కృషి

- శాసనమండలి సభ్యులు వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 14: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో స్మశానవాటిక, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు టీఎస్ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలసి శంకుస్థాపన చేశారు.

ప్రగతి పథంలో నిలుపడమే లక్ష్యం

- చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్,మార్చి 14: గ్రామాలను ప్రగతి పథంలో నిలుపడమే లక్ష్యంగా పని చేస్తున్నామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గొడుగుపల్లి, మహ్మద్‌షాపూర్‌లో సీసీరోడ్డు, తిర్మలాపూర్‌లో సీసీరోడ్డు తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారులాలు, నాయకులు మద్దెల స్వామి, దశరథరెడ్డి, మల్లారెడ్డి, భద్రయ్య బ్యాగారిరాజు, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ విద్యుత్ బిల్లు కట్టేది ఎవరు?

- రూ.1,40,141ల పెండింగ్ బిల్లు

కొమురవెల్లి, మార్చి 14 : కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ కరెంట్ బిల్లు రూ.1,40,141, మండల పరిషత్ కార్యాలయ బిల్లు రూ.21,640 చొప్పున బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్ అధికారులు కరెంట్ బిల్లు అడగడానికి భయపడుతున్నారా, లేక నిర్లక్ష్యంగా వదిలేశారో తెలియడం లేదు. పైగా విద్యుత్ కనెక్షన్ కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలు ఏర్పాటు చేసిన తరుణంలో కొమురవెల్లి మండలంగా ఏర్పడింది. వెను వెంటనే ప్రభుత్వ ఆఫీసులను ఏర్పాటు చేసే నేపథ్యంలో ఎమ్మార్వో ఆఫీస్‌ను ప్రైవేట్ అద్దె భవనంలో ఏర్పాటుచేసి, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం మల్లికార్జునస్వామి ఆలయానికి దాతలు నిర్మించి ఇచ్చిన గెస్ట్‌హౌస్ లలో ఏర్పాటు చేశారు. దేవాలయ గెస్ట్‌హౌస్‌లలో కొనసాగుతున్న రెండు కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ కోసం కొత్త భవనం నిర్మించిన సంగతి తెలిసిందే. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి కొత్త బిల్డింగ్‌లోకి పోలీస్‌స్టేషన్‌ను తరలిస్తే పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లు ఎవరు చెల్లిస్తారో అర్థం కాకుండా పోయింది. ఈ పెండింగ్ బిల్లుల పరిస్థితి పట్టుకోమంటే కప్పకు కోపం విడువమంటే పాముకు కోపం లాగా తయారైంది. ఈ పెండిగ్ బిల్లులు ఏ విభాగం వారు చెల్లిస్తారో ఇరు శాఖల అధికారులు ఏ విధంగా సమస్యను పరిష్కరించుకుంటారో వేచి చూడక తప్పదు.


ఆలయ గెస్ట్‌హౌస్ ఏర్పాటుచేసిన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్

విద్యుత్ కోతలు, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎంపీపీ బాలేశంగౌడ్

జగదేవ్‌పూర్, మార్చి 14: వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కోతలు, తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలేశంగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, పశు వైద్య, విద్యాశాఖ అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. ఇటిక్యాల, కొత్తపేట గ్రామాలలో తాగునీటి సమస్య ఉందని, ఇటిక్యాల ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామాలలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని సూచించారు. మిషన్‌భగీరథ తాగునీరు రాని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో శ్రీనివాస్‌వర్మ, ఎంపీటీసీలు కిరణ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మహేశ్‌యాదవ్, కవితారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుమలరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివశంకర్, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ దేవయ్య తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశంగౌడ్

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రభావతి

గజ్వేల్, మార్చి 14: మహిళలకు చట్టసభల్లో సమాన హక్కులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.ప్రభావతి కోరారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వారితో టీఎస్‌యూటీఎఫ్ నాయకురాలు నిర్మల, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, వెంకటకిరణ్, మహేశ్వరీ ఉన్నారు.

హైవే నిర్మాణంలో నష్టం లేకుండా చూడాలి

- దుకాణాలు బంద్ చేసిన వ్యాపారులు


హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేస్తున్న వ్యాపారులు

హుస్నాబాద్, మార్చి 14 : సిద్దిపేట- ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న దుకాణాలకు నష్టం లేకుండా చూడాలని గురువారం బాధితులు అధికారులను కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో పనులు ప్రారంభించడంతో, తమకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని, రోడ్డు మధ్య నుంచి 43 ఫీట్ల వరకు ఉన్న వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు తమ దుకాణాలు మూసి నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో డిగ్రీ కళాశాల నూతన భవనంలో పనులు


కళాశాల వద్ద ఎడ్యుకేషనల్ సొసైటీ అధికారులు

హుస్నాబాద్, మార్చి 14: పాత భవనంలో ఉన్న హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నూతన భవనంలోకి వెంటనే మార్చాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. దీంతో అందుకు అనుగుణంగా పనులు చకచకా జరుగుతున్నాయి. డిగ్రీ కళాశాల భవనంలో విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశారు. గురువారం ఎడ్యుకేషనల్ సొసైటీ ఈఈ అనితా శ్రీనాథ్, డీఈ నాగేశ్వర చారిలు కళాశాల వద్ద ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు భవనాన్ని అప్పగింస్తున్నామని వారు వెల్లడించారు. రెండు మూడు రోజుల్లో తరగతులు నూతన భవనంలో జరిగే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

అందరికీ అందుబాటులో ఉంటా

- పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, మార్చి 14: ముప్పైమూడేళ్లుగా సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు లేకుండా పోయిందని, ఇప్పటి నుంచి మీ అందరికీ అందుబాటులో ఉంటానని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బీఎస్పీ పార్టీ నాయకుడు, జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఫౌండేషన్ చైర్మన్ మంద పాండు ఆయన ఆధ్వర్యంలో అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు పూజల హరికృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పూజల హరికృష్ణ

శనిగకుంట రైతులకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్

నారాయణరావుపేట,మార్చి14: శనిగకుంట రైతులకు కాలువల ద్వారా సాగునీరందించి శాశ్వత పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ రైతులకు భరోసా కల్పించారు. గురువారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శనిగకుంట రైతుల ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల నిర్మాణంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జక్కాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని బాలయ్య కాంగ్రెస్ నాయకులు రాజు, కాంతయ్య, దేవయ్య, రామచంద్రం, భూపతి రెడ్డి, పర్శరాములు, ప్రతాప్, లింగారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి లోక్‌సభస్థానానికి సీపీఎం పోటీ

చేర్యాల, మార్చి 14 : భువనగిరి లోక్‌సభ స్థానానికి సీపీఎం పోటీచేస్తుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావ్, రాళ్లబండి రవీందర్ పాల్గొన్నారు.

365-బీ జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు కొరవడుతున్నాయి. దీంతో మూన్నాళ్లకే రోడ్డు కుంగిపోతున్నది. వరద నీటి మళ్లింపుకోసం కొద్ది రోజులక్రితం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అక్కడ బీటీ కుంగిపోయింది. కల్వర్టు సీసీ అంచు తగిలి వాహనాలు బోల్తాపడుతుండటంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు.


రోడ్డు కుంగడంతో డివైడర్ కింద ఏర్పడిన పగుళ్లు

- చేర్యాల